క్లుప్తంగా

33 యూనిట్ల రక్తదానం


రక్తదానం చేస్తున్న అభిమానులు

టెక్కలి: ఈ నెల 20న జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం టెక్కలిలో అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.భాస్కర్ ఆధ్వర్యంలో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 33 యూనిట్లు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి బి.సునీతతో పాటు ఎన్టీఆర్ అభిమానులు వెంకీ, పవన్, బాలకృష్ణ, సింహాద్రి, లక్ష్మణ్, డిల్లీ, సంతోష్ పాల్గొన్నారు.

బోరుబావి ఏర్పాటుకు ఎమ్మెల్సీ శంకుస్థాపన


బోరుబావి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కవిటి: మండలంలోని లండారపుట్టుగ పంచాయతీ పరిధి పొందూరుపుట్టుగలో విద్యుత్ బోరు బావి నిర్మాణానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రకాష్ పాల్గొన్నారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.60 లక్షలతో బోరును ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకాష్ తెలిపారు.

బోరు బాగు చేయాలని విజ్ఞప్తి


పాడైన బోరింగు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 10 వార్డులో చేతిబోరు పాడైంది. దీంతో స్థానికులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. వేసవి నేపథ్యంలో సమస్య మరీ ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి సింధుపాటరాణి ఉత్సవాలు


సోంపేట: పూజలందుకోనున్న నీలమ్మతల్లి

కంచిలి: మండలంలోని తలతంపర గ్రామంలో వెలసిన సింధుపాటరాణి గ్రామదేవత ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక, వీధి నాటక, స్టేజి ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి హుకుంపేటలో..

సోంపేట: మండలంలోని కొర్లాం పంచాయతీ హుకుంపేట గ్రామంలో నీలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలను సోమవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనికి కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కానిస్టేబుల్‌కు పరామర్శ


యుగంధర్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ యుగంధర్ వడదెబ్బకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీ ట్రేడ్ చైర్మన్ వజ్జ బాబూరావు యుగంధర్‌ను ఆదివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

మాయాజలం..!

- పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్న వాటర్‌ప్లాంట్లు
- అనుమతులు లేకుండానే ప్లాంట్లు ఏర్పాటు
- కొరవడిన అధికారుల నిఘా


పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ వాటర్‌ప్లాంట్

ఇచ్ఛాపురం: పట్టణం నుంచి పల్లె వరకూ ప్రస్తుతం మాయా'జలం'నడుస్తోంది. శుద్ధజలాల పేరుతో ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్లు వెలుస్తున్నాయి. అయితే వీటిలో చాలావాటికి అసలు ఎలాంటి అనుమతులు కూడా లేవు. మూడు పువ్వులు.. ఆరుకాయలుగా సాగుతున్న జల వ్యాపారాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. వాటర్ ప్లాంట్ నిర్వాహకులు మాత్రం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) నియమనిబంధనలు పాటించకుండా మినరల్ పేరుతో నీటిని విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. నీటి వ్యాపారం లాభసాటి మారడంతో చాలామంది దీనిపై దృష్టిపెట్టారు. ప్రస్తుతం ప్రతీ ఒక్కరు దాహం తీర్చుకునేందుకు ఎక్కువగా వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, క్యాన్లను కొనుగోలు చేస్తున్నారు. దీనినే అదునుగా చేసుకొని కొంతమంది శుద్ధజలం పేరిట అడ్డగోలు వ్యాపారాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే వారికి అనువైన ప్రదేశాల్లో వాటర్‌ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో సుమారు 300 వరకు వాటర్‌ప్లాంట్‌లు ఉన్నాయి. వీటిలో చాలావాటికి కనీస అనుమతుల్లేవు. ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా వాటర్‌ప్యాకెట్లు తయారు చేసి మార్కెట్లకు తరలిస్తున్నారు. వాటర్ ప్యాకెట్లపై ఎటువంటి కాలపరిమితి, ఎంఆర్‌పీ, బీఎస్‌ఐ మార్కుల్లేకుండానే అడ్డగోలుగా అమ్మకాలు చేస్తున్నారు. మినరల్ పేరుతో సాధారణ నీటినే విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వాటర్ పాకెట్‌ను రూ. రెండు నుంచి మూడు రూపాయలకు, 20 లీటర్ల వాటర్ క్యాన్‌ని రూ. 10 నుంచి 20 వరకు విక్రయిస్తున్నారు. ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్‌లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నీటి వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుంది. ప్రస్తుతం వేసవి కావడంతో ఈ వ్యాపారం మరింత జోరందుకుంది. కొన్ని వాటర్ ప్లాంట్ల వద్ద కనీసం పరిశుభ్రత కూడా పాటించడం లేదు. సాధారణంగా వాటర్ ప్లాంట్లలో ఎయిర్ కండీషనర్‌తో కూడిన కెమికల్ ల్యాబ్, మైక్రోబయాలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది, స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారీ చేసిన వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయాలి. మూడు నెలలకొకసారి వాటర్ ప్లాంట్‌ల నుంచి సంబంధిత అధికారులు నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయాలి. లేదంటే టైఫాయిడ్, కామెర్లు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, చర్మవ్యాధులు, కీళ్లనొప్పులు, గొంతు సమస్యలు, దంత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.


విక్రయానికి ట్రాలీలో వాటర్ క్యాన్లను తరలిస్తున్న దృశ్యం

నిబంధనలు పాటించాలి



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్లలో తప్పని సరిగా నిబంధనలు పాటించాలి. లేనిచో అటువంటిపై చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించాం. వాటర్ ప్లాంట్ నిర్వహించాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పని సరి. ప్లాంట్లను ఏర్పాటు చేసిన తరువాత సంబంధిత అధికారులు వచ్చి వాటర్ ప్లాంట్‌లను పరిశీలించి అనుమతులు మంజూరు చేయవలసి ఉంటుంది. దీనికి విరుద్ధంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– ఎన్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

అధికారులు పర్యవేక్షించాలి..



మున్సిపాలిటీలో ఏర్పడిన నీటిసమస్య కారణంగా కొద్దిరోజులుగా మినరల్ వాటర్‌ని కొనుగోలు చేస్తున్నాము. ఈ నీరు శుద్ధి చేస్తున్నారో..లేదో తెలియడం లేదు. ఆ నీటిలో మినరల్స్ ఉన్నది లేనిది సంబంధిత అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలి. నిబంధనల మేరకు ప్లాంట్లను నిర్వహించకపోతే అలాంటి నీటిని తాగి ప్రజలు రోగాలబారినపడతారు. ఇటువంటి అనర్థాలు జరుగకముందే అధికారులు మేల్కోవాలి.

–ఎన్.మదన్‌కుమార్, వినియోగదారుడు, ఇచ్ఛాపురం

ఘనంగా అమ్మవారి చల్లదనం ఉత్సవాలు


కవిటిలో చింతామణి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం కవిటి చింతామణి అమ్మవారికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మొక్కుబడులు తీర్చేక్రమంలో భాగంగా ఆదివారం చల్లదనం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అలాగే జగతి గ్రామదేవత మర్లపోలమ్మ అమ్మవారికి భక్తులు చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దను మేళతాళాలతో కాళీకాదేవి వేషధారణలతో పట్టణ వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


జగతిలో మర్లపోలమ్మ అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

–కవిటి

ఫ్రీజర్ బాక్స్ కోసం సంప్రదించండి..


ఫ్రీజర్ బాక్సు

కాశీబుగ్గ: పేద, నీరుపేదల ఇంట్లో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని కొన్నిగంటలు ఉంచేందుకు ఇబ్బందులు పడుతుంటారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు అద్దెకు ఫ్రీజర్ బాక్స్‌ను తీసుకొచ్చి అందులో ఉంచుతారు. అయితే పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఏ ప్రాంతంలోనైన ఎవరైన చనిపోతే మృతదేహాన్ని ఉంచేందుకు ఫ్రీజర్ బాక్సును ఉచితంగా సమకూర్చుతామని కోసంగిపురం కూడలిలో ఉన్న లలితాశ్రమ అధిపతి సువ్వారి చిన్నిక్రిష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఓ గుప్త దాత సాయంతో దీన్ని అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన వారు 85002 72747, 89856 29055, 62811 86450 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేరుకే బస్టాండ్..!

- కనీస మౌలిక సదుపాయలు కరువు


వర్షం నీటితో నిండిపోయిన బస్టాండ్


పశువుల పేడతో నిండిపోయిన బస్టాండ్ ఆవరణ

కాశీబుగ్గ:

కాశీబుగ్గలోని రాజీవ్‌గాంధీ బస్టాండ్‌ను చూసి ప్రయాణికులు అసహ్యాహించుకుంటున్నారు. కనీస మౌలిక సదుపాయల్లేక అవస్థలు పడుతున్నారు. సమస్యలకు నెలవుగా బస్టాండ్ మిగిలింది. రోజుకు సుమారు పదివేల నుంచి పదిహేను వేల మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు చేస్తుంటారు. అయితే ఇక్కడ అంతా గజిబిజీగా ఉంటుంది. కనీస నిబంధనలు కనిపించవు. ఏ బస్సు ఎటు నుంచి వస్తుందో..ఎటునుంచి వెళ్తుందో అర్థం కాని పరిస్థితి. ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాహం వేస్తే నీటి కోసం అవస్థలు పడాల్సిందే. ఇక్కడ మంచినీటి సౌకర్యం కూడా లేదు. అలాగే మూత్రం పోయాలంటే పది రూపాయలు వసూలు చేస్తున్నప్పటికీ అక్కడ అపరిశుభ్రత వాతావరణం ఆందోళన కలిగిస్తుంది. ప్రధానంగా ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు. నిలబడి ఉందామంటే పశువుల పేడ, మూత్రం కంపుతో అల్లాడిపోవాల్సిందే. అలాగే చినుకుపడితే బస్టాండ్ ఆవరణ నీటితో నిండిపోతుంది. కనీసం ఫ్యాన్లు కూడా లేకపోవడంతో చెమటతో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. బస్టాండ్ చుట్టూ దుకాణాలు, తోపుడు బళ్లు, బస్టాండ్‌లో చిరువ్యాపారులతో నిండిపోయి ప్రయాణికులకు రాకపోకలకు అవకాశం లేకుండా చేస్తున్నారు.వర్షం పడితే పశువులకు ఆవాసంగా బస్టాండ్ మారిపోతుంది.


కుర్చీల్లేక నిలబడి ఉన్న ప్రయాణికులు

సౌకర్యాలు కల్పించండి



కాశీబుగ్గ బస్టాండ్‌లో ప్రయాణికులు నిలబడేందుకు బయపడుతున్నారు. పశువులు బస్టాండ్‌లోనే ఉంటూ పాడుచేస్తున్నాయి. తాగడానికి మంచి నీరు, కూర్చునేందుకు కుర్చీలు, ఫ్యాన్లు లేవు. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు, నాయకులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.

– సుజాత పండా, ప్రయాణికురాలు, కాశీబుగ్గ

సమాచారం కరువు



బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎటువంటి సమాచారం లేకుండా పోయింది. చదువుకున్నవారు సైతం తడబడే పరిస్థితి కనిపిస్తుంది. ఎక్కడ ఏ బస్సు ఆగుతుందో విధి విధానం లేకుండా పోయింది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించి.. సదుపాయాలు కల్పించాలి.

– నవర నందేశ్వరరావు, గోపిటూరు

సమస్యలను గుర్తించాం..

కాశీబుగ్గ బస్టాండ్‌లో సమస్యలు ఉన్న విషయాన్ని ఇటీవల గుర్తించాం. మున్సిపల్ పాలకవర్గం, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. మంచినీరు, కుర్చీలు, ఫ్యాన్‌లు, టీవీలు ఏర్పాటు చేస్తాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్టాండ్ చుట్టూ గ్రిల్ ఏర్పాటు చేస్తాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

కల్యాణ వైభోగమే..



నందిగాం మండలం రౌతుపురంలో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. పురోహితుడు శంబాన దానయ్య ఆధ్వర్యంలో ఆలయ ఏడో వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో స్వామివారికి విశేష పూజలు జరిగాయి. వైభవంగా జరిగిన కల్యాణ మహోత్సవాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు.

–నందిగాం

ఆదమరిస్తే ప్రమాదమే..



కంచిలిలో హైవే పక్కన సర్వీసు రోడ్డులో పలు చోట్ల బెర్ములు పాడయ్యాయి. మఠంకంచిలికి వెళ్లే కూడలి వద్ద ఇటుకుల బట్టీ ఎదురుగా రోడ్డు కోతకు గురై ప్రమాదకరమైన పరిస్థితి చోటుచేసుకొంది. రోడ్డు నిర్మాణ సమయంలోనే పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ప్రారంభం నుంచి ఇక్కడ అయోమయంగా ఉంది. రోడ్డు ఎత్తుగా ఉండి, పక్కన బెర్మ ఏర్పాటుకు వీల్లేని పరిస్థితిలో ఉండటంతో అలాగే విడిచిపెట్టేశారు. అక్కడ రక్షణ గోడ వంటిది నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు అయోమయానికి గురై ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్‌హెచ్–16 అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

–కంచిలి

అ'పూర్వ'కలయిక..



రెండు దశాబ్దాల తరువాత పూర్వ విద్యార్థులంతా ఒకేవేదికపై కలుసుకున్నారు. దీనికి కవిటి మండలం బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. 2005–06 విద్యా సంవత్సరంతో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. చదువుకున్న పాఠశాలలోనే కలుసుకొని సందడిగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ గురువులకు పాదపూజ చేసి దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి గౌరవించారు. విందుభోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాస భరింతంగా గడిపారు. గ్రూపు ఫొటోలను తీసుకొని మురిసిపోయారు.

–కవిటి

దేశభక్తి ఉప్పొంగేలా..


టెక్కలి: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా టెక్కలి పట్టణంలో తిరంగ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. జాతీయ పతాకాలతో దేశ భక్తి ఉప్పొంగే విధంగా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం టౌన్: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఇచ్ఛాపురం పట్టణంలో కూటమి నాయకులు తిరంగ ర్యాలీని నిర్వహించారు. బస్టాండ్ నుంచి దాసన్నపేట మీదుగా రథంవీధి గుండా బస్టాండ్ వరకూ ర్యాలీ సాగింది. సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ , దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురంలో తిరంగ ర్యాలీ చేస్తున్న దృశ్యం

విద్యాభివృద్ధికి కృషి

- యువీవీ వార్షికోత్సవంలో వక్తలు
- పలువురికి సన్మానం


సన్మాన గ్రహీతలతో యూవీవీ ప్రతినిధులు

పలాస: ఉద్దానంలో విద్యాభివృద్ధికి అందరూ కృషి చేయాలని వక్తలు అన్నారు. పలాస మండలం నీలావతి గ్రామంలోని ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు విద్య, సాహిత్య వేత్తలు, విద్యార్థులను సత్కరించారు. సంస్థ అధ్యక్షులు బొమ్మాళి శివ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ గొరకల గిరిబాబు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యా సాహిత్య రంగంలో విశిష్ట సేవలందించిన కంచరాన రమేష్, సాతుపల్లి తాతారావు, తెప్పల క్రిష్ణమూర్తి, లండ సాంబమూర్తిలను యువీవీ సభ్యులు సత్కరించారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, జాతీయ స్థాయిలో జరిగిన నీట్, ఐఐటి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆహ్వాన గ్రూపు టాలెంట్ పరీక్షకు విశేష స్పందన లభించింది. గురుదాసుపురం, మామిడిపల్లి, బొడ్డపాడు బృందాలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు లభించాయి. విజేతలకు నగదు బహుమతలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జి.లోకేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి జినగ సీతారామ్, గౌరవ అధ్యక్షుడు కుత్తుం ప్రకాశరావు, ఉపాధ్యక్షురాలు పోతనపల్లి గీతమ్మ, దుమ్ము శంకరరావు, కుత్తుం వినోద్, బొడ్డు చిన్నారావు, లెప్పల వాసు, కుత్తుం సుధాకర్, రెయ్యి క్రిష్ణారావు, మడియా వాసు, పోతనపల్లి మాధవరావు, ఎంపల్లి కామేశ్వరరావు, దాసరి ఈశ్వరరావు, మద్దిల రామారావు, బత్తిన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

